క్లుప్తంగా

వేతనాలు చెల్లింపు

సాక్షి ఎఫెక్ట్..

చిట్యాల : మండలంలోని వెలిమినేడు గ్రామపంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు అందకపోవడంతో వారి ఇబ్బందులపై ఈనెల 23న సాక్షిలో 'వేతనాలు అందక అవస్థలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో కథనానికి పంచాయతీ అధికారులు స్పందించారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న 18మంది కార్మికులకు ఒక నెల వేతనాన్ని వారి ఖాతాల్లో శనివారం జమ చేశారు. మరో రెండు నెలల వేతనాలను త్వరలోనే అందజేస్తామని పంచాయతీ అధికారులు తెలిపారు.

పాఠశాలలో పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

చిట్యాల : మండలంలోని ఆరేగూడెం గ్రామంలోని యూపీఎస్ పాఠశాలలో మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న నిర్మాణ పనులను శనివారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పరిశీలించారు. అనంతరం పనుల వివరాలను గ్రామ సర్పంచ్ అర్రూరీ లాలమ్మస్వామిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్సీకి సర్పంచ్ వినతిపత్రం అందజేశారు. ఆయన వెంట పాఠశాల హెచ్‌ఎం ఉదయ తదితరులు ఉన్నారు.

నిధుల విడుదలపై హర్షం



మాట్లాడుతున్న కొండూరు సత్యనారాయణ

నల్లగొండ టూటౌన్ : రజక, నాయీబ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పథకానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.75కోట్లు విడుదల చేయడంపై ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్షా 8వేల మంది రజకులు, నాయీబ్రాహ్మణులకు లాండ్రీ షాపులు, సెలూన్లలో ఉచిత్ విద్యుత్ అందించడానికి ప్రభుత్వం ఆయా ఫెడరేషన్లకు నిధులు విడుదల చేయడం సంతోషకర విషయమన్నారు. సమావేశంలో రజక సంఘాల జిల్లా అధ్యక్షుడు చిలకరాజు చెన్నయ్య, నాయీబ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు నేలపట్ల రమేష్, కానుగుల అంజయ్య, పగిళ్ల సైదులు, వెంకటేశ్వర్లు, సతీష్, వెంకన్న పాల్గొన్నారు.

కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

మర్రిగూడ : ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా ప్రజా వ్యతిరేకమైందని, అది పూర్తిగా కార్పొరేట్, బహుళ కంపెనీలకు అనుకూలంగా ఉందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండా శ్రీశైలం విమర్శించారు. శనివారం మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఫిబ్రవరి 26, 27తేదీల్లో బడ్జెట్ కాపీలను దహనం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, వెంకటయ్య, శ్రీశైలం ఉన్నారు.

ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్ : ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తల్లమళ్ల హసేన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ భవన్‌లో హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ కాంతయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పాలడుగు నాగార్జున, కట్ట దుర్గాప్రసాద్, కట్టెల శివకుమార్, సైదులు, శ్రీనివాస్, జగన్, యాదయ్య, రమేష్, రవీందర్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ పేదలకు వరం



చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజలకు వరంలాంటిదని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో అనారోగ్య కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 46మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.24లక్షల 45వేల చెక్కులను ఆయన అందజేశారు.

కుక్కల బెడదను నివారించాలి..

- కోతులు, పందులతోనూ ఇబ్బందులు పడుతున్నాం
- అన్ని వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలి
- 'సాక్షి' ఫోన్ ఇన్‌లో కమిషనర్‌కు విన్నవించిన నకిరేకల్ మున్సిపల్ ప్రజలు
- దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తామని కమిషనర్ హామీ



ఫోన్ ఇన్‌లో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ నల్లా బాలాజీ

సాక్షి ఫోన్‌ఇన్

నకిరేకల్: నకిరేకల్ మున్సిపాలిటీలో మొత్తం 20 వార్డుల్లో సుమారు 40 వేల పైచిలుకు జనాభా ఉన్నారు. ఇక్కడి ప్రజలు ప్రధానంగా కుక్కలు, కోతుల బెడదతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యల పరిష్కారానికి 'సాక్షి' ఆధ్వర్యంలో శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నకిరేకల్ మున్సి పల్ కమిషనర్ నల్లా బాలాజీతో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా వివిధ వార్డుల ప్రజలు తమ పరిధిలో నెలకొన్న కోతులు, కుక్కలు, పందులు, మురుగు కాల్వలు, నీటి సమస్య, వీధిదీపాలు, సీసీ రోడ్లు తదితర సమస్యలను ఆయనకు విన్నవించి పరిష్కరించాలని కోరారు.

సమస్యలు.. సమాధానాలు..

ప్రశ్న : అన్ని వార్డులకు కృష్ణాజలాల సరఫరా అయ్యేలా చూడాలి.

–కనుకుంట్ల విద్యాసాగర్‌రెడ్డి, రంగారెడ్డినగర్

కమిషనర్ : పైపులైన్ నిర్మాణం పూర్తి కాలేదు. త్వరలోనే ఆ పనులు పూర్తి చేయించి అన్ని వార్డులకు కృష్ణాజలాలు అందిస్తాం,

ప్రశ్న : పందులతో జ్వరాల బారిన పడుతున్నాం. మిల్లు వెనుక కుక్కలు, కోతులతో పిల్లల బయట తిరగలేని పరిస్థితి ఉంది?

– షేక్ గఫూర్, సుందరయ్యనగర్

కమిషనర్ : ప్రత్యేక వాహనం తెప్పించి పట్టణానికి దూరంగా పందులను తరలిస్తాం.

ప్రశ్న : వాసవీనగర్‌లో డ్రెయినేజీ, సీసీ రోడ్డు లేదు, కరెంటు స్తంభాలు లేవు, పాములతో ఇబ్బందులు పడుతున్నాం.

– చిగుళ్ల లింగయ్య, వాసవీనగర్

కమిషనర్ : సీసీ రోడ్డు, స్తంభాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపుతాం.

ప్రశ్న : కోర్టు వెనుక ప్రాంతంలో మంచినీటి లైన్, మురుగు కాల్వలు లేవు.

– స్నేహ, 4వ వార్డు

కమిషనర్ : కౌన్సిలర్లతో చర్చించి ప్రతిపాదనలు పంపి చేయిస్తాం.

ప్రశ్న : 6వ వార్డులోని చీమలగడ్డలో కుక్కల బెడదను నివారించాలి.

– మేడిపల్లి సైదులు, చీమలగడ్డ

కమిషనర్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు త్వరలో చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న : గురుకుల పాఠశాలకు వెళ్లేదారిలో ఇళ్ల ముందు మురుగు సమస్య లేకుండా చూడాలి.

– అన్నపూర్ణ, రెడ్డినగర్

కమిషనర్ : డ్రెయినేజీ నిర్మాణం కోసం వెంటనే ప్రతిపాదనలు పంపిస్తాం.

ప్రశ్న : మా కాలనీకి మంచినీరు రావడం లేదు. పందులు చనిపోయినా తొలగించడం లేదు.

– ముద్దం విజయ్, వైఎస్సార్ కాలనీ

కమిషనర్ : నీరు సరఫరా అయ్యేలా చూస్తాం, పందుల కళేబరాలను వెంటనే తొలగిస్తాం.

ప్రశ్న: బాబాసాహెబ్‌గూడెంలో ముత్యాలమ్మగుడి వద్ద సాగర్ ట్యాంకు వద్ద మురుగు లేకుండా చూడాలి, ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయించాలి.

– ఖాజా బాబా, అలీపాషా, బాబాసాహెబ్‌గూడెం

కమిషనర్ : నీరు నిల్వ లేకుండా చర్యలు చేపడతాం . రక్షణ కంచె నిర్మిస్తాం.

ప్రశ్న : 16, 17 వార్డుల మధ్యలో స్తంభాలు నాటి విద్యుత్ లైన్ వేయలేదు.

– అసిఫ్‌అలీ, 17వ వార్డు

కమిషనర్ : వైర్లు, ఇతర మెటీరియల్ తెప్పించి సరఫరా చేస్తాం.

ప్రశ్న : 8వ వార్డు ఎస్సీ కాలనీలో, బాబాసాహెబ్‌గూడెంలో కుక్కలు, కోతుల బెడద ఉంది.

– గోవర్ధన్, భూపతిశివ, 8వ వార్డు, బాబాసాహెబ్‌గూడెం

కమిషనర్ : కుక్కలు, కోతుల నివారణ చర్యలు తీసుకుంటాం.

పాలకవర్గంతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తాం

మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో కుక్కలు, కోతులు, పందుల బెడద తీవ్రంగా ఉన్నట్లు పట్టణ ప్రజలు సాక్షి ఫోన్ ఇన్ ద్వారా మా దృష్టికి తెచ్చారు. పందుల విషయంలో పెంపకందారులను పిలిపించి పట్టణం నుంచి తరలించాలని తెలియపరిచాం. వారు వినని పక్షంలో స్వయంగా మేమే తరలిస్తాం. కోతుల నియంత్రణకు కూడా జిల్లా అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం. కుక్కల నివారణ విషయంలో చికెన్, చేపల మార్కెట్లలో వ్యాపారులకు అవగాహన కల్పించాం. ఇక.. వీధిదీపాల, పారిశుద్ధ్యం, సీసీ రోడ్ల విషయంలో పాలక వర్గంతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తాం.

– నల్లా బాలాజీ, మున్సిపల్ కమిషనర్, నకిరేకల్

ప్రశ్న : డాక్టర్స్ కాలనీ–రంగారెడ్డి నగర్ మధ్యలో వీధిదీపాలు వెలగక రెండు మాసాలు దాటింది. కట్ట కింద కంపచెట్లు, మరోవైపు కోతులతో ఇబ్బందులు పడుతున్నాం. ఆ సమస్యలను తీర్చాలి.

– గున్నాల అర్చన, 1వ వార్డు

కమిషనర్ : వీధిలైట్లు వేయిస్తాం. కోతుల నివారణకు చర్యలు చేపడతాం.

ప్రశ్న : గురుకుల పాఠశాల నుంచి మురుగు నీరు వచ్చి ఎస్ఎల్‌బీసీ కాలనీలో నిలుస్తుండడంతో దుర్వాసన వస్తోంది. వెంటనే సమస్యను పరిష్కరించాలి.

–వాడపల్లి సంపత్, ఎస్ఎల్‌బీసీ కాలనీ

కమిషనర్ : పాఠశాల ఆవరణలో సంపు నిర్మించి అందులో స్టోర్ అయ్యేలా చర్యలు చేపడతాం.

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్ : రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం పట్టణంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు వెంట నడుచుకుంటూ వ్యాపారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మూసీరోడ్డులో నిర్మాణంలోని గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, కమిషనర్ బాలాజీ, వార్డు కౌన్సిలర్లు కందాల భిక్షంరెడ్డి, పల్లె విజయ్, రాచకొండ సునీల్, బానోతు వెంకన్న, చెవుగోని అఖిల లక్ష్మీనారాయణ, తదితరులు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

మండలంలోని పాలెం గ్రామానికి చెందిన దూదిమెట్ల లక్ష్మమ్మకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీ నగేష్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ ఏకుల కవితావిజయ్‌కుమార్, నాయకులు నోముల కేశవరాజు పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

కేతేపల్లి : మండలంలోని కాసనగోడు గ్రామానికి చెందిన దిండుగాల యాదగిరి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరాడు. దీంతో ఆయన అత్యవసర వైద్య ఖర్చుల కోసం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చొరవతో ముందస్తుగా మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌ఓసీ మంజూరు పత్రాన్ని శనివారం నకిరేకల్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మాజీ చైర్మన్ చల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకనే దాడులు

కేతేపల్లి : నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం అనుచరులు దాడులు, దౌర్జన్యాలకు దిగుతున్నారని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, నకిరేకల్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి విమర్శించారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధితో తమ ఉనికిని కోల్పోతున్నామనే ఆక్రోశంతో అభివృద్ధి శిలాఫలకాలు, పార్టీ ఫ్లెక్సీలు చించివేయడం హేయమైన చర్య అని అన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి చర్యలకు పాల్పడితే సహించేది లేదన్నారు. రాబోయే ఎన్నికల్లో నకిరేకల్ బీఆర్‌ఎస్ టికెట్, గెలుపు చిరుమర్తి లింగయ్యదేనని వారు ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ బొప్పని స్వర్ణలతసురేష్, సర్పంచ్‌లు కోట వెంకటేశ్వరావు, బచ్చు జానకిరాములు బీఆర్‌ఎస్ నాయకులు గోలి వేణుమాధవరెడ్డి, కొండ సైదులు, చల్ల కృష్ణారెడ్డి, ఆర్.సైదులు, రాంలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

'ఎన్జీ'లో జాతీయ సైన్స్ దినోత్సవం

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని ఎన్‌జీ కళాశాలలో జాతీయ సైన్స్–2023 వారోత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సైంటిఫిక్ టెంపర్ ఇన్ ఇండియన్ గ్రాడ్యుయేట్ స్టూడెంట్స్ అనే అంశంపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు ఉపన్యాస పోటీల్లో పాల్గొని శాస్త్ర సాంకేతిక రంగంలోని పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో జువాలజీ ఇన్‌చార్జ్ శ్రీనాథ్‌పటేల్, అధ్యాపకులు గంజి భాగ్యలక్ష్మి, నవీన్‌రెడ్డి, సరిత, మహేశ్వరి, గిరిబాబు తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

- ఎమ్మెల్యే గాదరి కిశోర్



శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్

శాలిగౌరారం : ఆధ్యాత్మికచింతనతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీశాంభవి శంభులింగేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు శనివారానికి ఎనిమిదో రోజుకు చేరుకోవడంతో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం పాటుపడుతుందన్నారు. మండలంలోని దేవాలయాల అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ షేక్ ఇంతియాజ్, ఎంపీటీసీ మాదగోని కవితరామలింగయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, నాయకులు చాడ హరీష్‌రెడ్డి, కొండేటి వేణుగోపాల్‌రెడ్డి, మామిడి సర్వయ్య, జోలం రమేశ్, వలిశెట్టి దశరథ, రాజు, వెంకన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నల్లగొండ టౌన్ : మెడికల్ విద్యార్థిని ప్రీతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడిని, ఎంజీ యూనివర్సిటీ విద్యార్థి నవీన్‌ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ఎస్పీ కార్యాయానికి వెళ్తుండగా వారిని స్థానిక గడియారం సెంటర్‌లో పోలీసులు అడ్డుకుని అరెస్టు చేశారు. నిందితులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించి బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాలడుగు నాగార్జున, పందుల సైదులు, బకరం శ్రీనివాస్, ఇందూరు సాగర్, కట్టెల శివకుమార్, ఐతగోని జనార్దన్‌గౌడ్, కొండేటి మురళి, వినయ్, నర్సింహ, రవీందర్, రాములు, దేవయ్య, నరసింహ, వినయ్‌కుమార్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కందాల ప్రమీల

కేతేపల్లి : వ్యవసాయానికి 24గంటలు నాణ్యమైన విద్యుత్ అందజేసి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌పై ఓవర్‌లోడ్‌తో లోఓల్టేజీ సమస్య ఏర్పడి మోటార్లు కాలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలో అదనంగా రెండు 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లు ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు, మండల కార్యదర్శి సీహెచ్.లూర్థుమారయ్య, లింగయ్య, సుధీర్, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతరలో సామగ్రి విక్రయాలకు వేలం

చండూరు : మండలంలోని తుమ్మలపల్లిలో మార్చి 3నుంచి 11వరకు నిర్వహించే రామలింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా కొబ్బరికాయలు, లడ్డూ, పులిహోర తదితర సామగ్రి విక్రయాలకు శనివారం దేవాలయం ఆవరణలో అధికారులు, కమిటీ సభ్యులు వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ఆలయానికి రూ.7లక్షల2వేల ఆదాయం సమకూరనుంది.

సభను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్ : గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 12న పాలకుర్తిలో ప్రారంభమైన కార్మికుల పాదయాత్ర ముగింపుసభ హైదరాబాద్‌లో ఈనెల 28న నిర్వహించనున్నట్లు ఈ సభకు కార్మికులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ధ్యక్షుడు చిన్నపాక లక్ష్మీనారాయణ శనివారం పిలుపునిచ్చారు.

అజయ్ మృతి బాధాకరం

నల్లగొండ : పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు పన్నాల అజయ్‌రెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇటీవల ఆయన మృతి చెందడంతో శనివారం కుటుంబాన్ని పరామర్శించారు.

సంకీర్తన మృతికి నివాళి

మర్రిగూడ : మండలంలోని లెంకలపల్లి గ్రామానికి చెందిన మానె సంకీర్తన(19) హైదరాబాద్‌లోని శ్రేయస్ ఇంజనీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యనభ్యసిస్తుంది. విద్యార్థిని హాస్టల్ నుంచి వనస్థలిపురంలోని తన బంధువుల ఇంటికి బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడడంతో వెనుక నుంచి వచ్చిన బస్సు సంకీర్తనను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో శనివారం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకురాగా ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకట్ల సుభాష్, సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, బీఆర్‌ఎస్ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్, సీపీఐ మండల కార్యదర్శి ఈదుల భిక్షంరెడ్డి నివాళులర్పించారు.

సోనియా కృషి మరువలేనిది

కేతేపల్లి : కాంగ్రెస్ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ జాతీయ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టి కేంద్రంలో రెండుసార్లు అధికారంలోకి తీసుకవచ్చిన సోనియాగాంధీ కృషి మరువలేనిదని టీపీసీసీ ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. శనివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు.

వీధికుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

నల్లగొండ టూటౌన్ : వీధి కుక్కల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని, పాఠశాలకు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని మున్సిపల్ ఈఈ రాములు అన్నారు. శనివారం పట్టణంలోని పాత బస్తీ జెడీఎస్ పాఠశాలలో విద్యార్థులకు వీధి కుక్కల పట్ల జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి



నల్లగొండ టూటౌన్: మాట్లాడుతున్న పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్



నార్కట్‌పల్లి : మాట్లాడుతున్న వీరెల్లి చంద్రశేఖర్

నల్లగొండ టూటౌన్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ఇంటింటికి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ నల్లగొండ పార్లమెంట్ కన్వీనర్ బండారు ప్రసాద్ కోరారు. శనివారం పట్టణంలోని 48వ వార్డు రామగిరి శక్తి కేంద్రాలలో నిర్వహించిన ప్రజా గోస–బీజేపీ భరోసా స్ట్రీట్ కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవినీతి, అక్రమాలు లేని పాలన చేస్తుందన్నారు. రాష్ట్రంలో అవినీతితో కూడిన కుటుంబపాలన నడుస్తుందని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే పట్టణ అభివృద్ధికి నిధులు తీసుకురాకుండా అప్పురూపకంగా నిధులు తెచ్చి పట్టణ ప్రజలపై భారం మోపుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, పార్టీ పట్టణ అధ్యక్షుడు మొరిశెట్టి నాగేశ్వర్‌రావు, అసెంబ్లీ కన్వీనర్ దాయం భూపాల్‌రెడ్డి, యాదగిరాచారి, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, రావిరాల వెంకట్, నాగరాజు, నాగిరెడ్డి, వెంకన్న, నీరజ, గణేష్ పాల్గొన్నారు.

వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్

నార్కట్‌పల్లి : తెలంగాణలో సీఎం కేసీఆర్ రాజ్యాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తుండడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు వీరెల్లి చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండలంలోని ఎల్లారెడ్డిగూడెం శక్తి కేంద్రంలో గల బూత్‌ల్లో కార్నర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రపంచ దేశాలలో మన దేశం ఆర్థిక శక్తిగా ఐదోదేశంగా తయారు చేసిన ఘనత నరేంద్రమోదీ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొరివి శంకర్, పాల్వాయి భాస్కర్‌రావు, వనం శంకర్, వనం వెంకటేష్, తింగయ్య, మల్లిఖార్జున్, కార్తికేయ, చందు, మహేష్ తదితరులు ఉన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

కట్టంగూర్ : ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని బీజేపీ ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు గోలి ప్రభాకర్ అన్నారు. శనివారం మండలంలోని పామనగుండ్లలో ప్రజా గోస – బీజేపీ భరోసా కార్నర్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ రాష్ట్ర నాయకురాలు బండారు శైలజ, మండల అధ్యక్షుడు నూకల సుధాకర్‌రెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధికార ప్రతినిధి కోమటి భాస్కర్, మండల ప్రధాన కార్యదర్శి కారంపూడి సాయికుమార్, ముడుసు భిక్షపతి, పులకరం శంకర్ ఉన్నారు.

వైభవంగా ఆంజనేయస్వామి ప్రభల ఊరేగింపు



దేవాలయం వద్ద ఎడ్లబండ్లు, ట్రాక్టర్ల ప్రదక్షిణలు

శాలిగౌరారం : మండలంలోని వల్లాల గ్రామంలో గల శ్రీపార్వతి శంభులింగేశ్వర దేవాలయం బ్రహ్మోత్సవాలు శనివారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీపార్వతి శంభులింగేశ్వర దేవాలయం, శ్రీఆంజనేయస్వామి దేవాలయాల ఆధ్వర్యంలో ఆంజనేయస్వామి ప్రభల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో గ్రామంతో పాటూ చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తమ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లను అందంగా అలంకరించుకొని దేవాలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. ఈ ప్రదక్షిణలను చూసేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈనెల 18న ప్రారంభమైన దేవాలయ బ్రహ్మోత్సవాలు ఈనెల 26న(ఆదివారం) ముగియనున్నాయి.

పాఠశాలలో సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ మోహన్‌రెడ్డి

మర్రిగూడ : మండలంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి అన్నారు. శనివారం పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మొదటి సంవత్సరం విద్యార్థులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల యాదయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పందుల కృష్ణ, ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, ఉపాధ్యాయులు అభిలాష్, ఆంజనేయులు, ప్రవీణ్, ప్రియదర్శిని, మీనాకుమారి, నస్రీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

నోట్ పుస్తకాల పంపిణీ

నకిరేకల్ : మండలంలోని మర్రూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం పాఠశాల పూర్వ విద్యార్థి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చిలుకూరి గోవర్ధన్ 80మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లోకనాథం, ఉపాధ్యాయులు సిరిపురం శ్రీనివాస్, చిక్కుల్ల సుధాకర్, కె.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని పలు బాధిత కుటుంబాలకు బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పిల్లి రామరాజుయాదవ్ శనివారం ఆర్థికసాయం అందజేశారు. 20వ వార్డుకు చెందిన సముద్రాల ఊషయ్య కుటుంబానికి రూ.10వేలు, 13వ వార్డుకు చెందిన కస్తాల పార్వతమ్మ కుటుంబానికి రూ.10వేలు అందజేశారు.

శాలిగౌరారం : మండల కేంద్రం పరిధిలోని పావురాలగూడెం గ్రామానికి చెందిన గూడె పరమేశ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో అతడి కుటుంబానికి 2002–03 పదోతరగతి తోటి విద్యార్థులు శనివారం రూ.43వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బడారు మహేశ్, బట్ట శ్రీను, రాపాక రాజు, భూపతి నాగరాజు, రమేశ్, తాందారు సోములు, నరేశ్, సైదులు పాల్గొన్నారు.

వీధికుక్కల పట్టివేత

సాక్షి ఎఫెక్ట్..

నల్లగొండ పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉండడంతో పట్టణంలోని పాదచారులు, ప్రయాణికులు బయటకు వెళ్లాలంటే తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. దీంతో శని వారం 'కుక్కలున్నాయి.. జాగ్రత్త' అనే కథనాన్ని సాక్షిలో ప్రచురించడంతో అందుకు మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని వీధుల్లో సంచరించే కుక్కలను మున్సిపల్ సిబ్బంది పట్టుకొని శనివారం డంపింగ్‌యార్డుకు తీసుకెళ్లారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ







